రైతులకు సమస్యలు తీసుకురావద్దు

- ప్రతి రైతు పొలానికి దారి ఉండేలా చూడండి
- పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి
- నేషనల్ హైవే అధికారులతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


పొలాల్లోకి దారి ఏర్పాటు చేయాలని పీడీకి సూచిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


పొలంలో వర్షపునీరు రాకుండా చూడాలని ఎంపీకి వివరిస్తున్న రైతు గంగాదేవి

వేముల : గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో రైతులకు సమస్యలు తీసుకురావద్దని, రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేషనల్ హైవే అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కె.వెంకట బయపురెడ్డి, మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డిలతో కలిసి సిద్ధంరెడ్డిపల్లె గ్రామం నుంచి గోటూరు వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్ధంరెడ్డిపల్లె, పెద్దజూటూరు, చింతలజూటూరు, గోటూరు, నల్లచెరువుపల్లె గ్రామాల రైతులు తమ సమస్యలను ఆయనకు వివరించారు. సర్వీసు రోడ్డుకు పూర్తిస్థాయిలో కంచె ఏర్పాటు చేస్తున్నారని, దీంతో పొలాల్లోకి దారి లేకుండాపోతోందని, రోడ్డు నిర్మాణంతో వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నామని, గ్రామాల మధ్య బ్రిడ్జిలను ఇరుకుగా నిర్మిస్తున్నారని, పీబీసీ కాలువకు బ్రిడ్జి నిర్మాణంలో ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. దీంతో ఆయన నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ రవీంద్ర షా, కంపెనీ ప్రతినిధులతో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో పరిశీలించారు. ముందుగా సిద్ధంరెడ్డిపల్లె – ఎద్దులయేనే గ్రామాల మధ్య ఇరుకుగా నిర్మించిన బ్రిడ్జిని పరిశీలించారు. పొలాల్లో వర్షపునీరు నిలిచిన ప్రాంతాలను, వర్షపునీరు వెళ్లే రైతుల పొలాలను, పీబీసీ కాలువ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ సర్వీసు రోడ్డును పూర్తిగా కంచె వేసి మూసివేయడం వలన రైతులకు పొలాల్లోకి వెళ్లేందుకు దారి ఉండదని, ఈ విధంగా జిల్లా సరిహద్దు వరకు సర్వీసు రోడ్డుకు ఆనుకోని ఉన్న రైతులకు కచ్చితంగా పొలాలకు వెళ్లే దారి ఉండేలా చూడాలని సూచించారు.

చర్యలు తీసుకోవాలి

హైవే రోడ్డు ఎత్తులో నిర్మించడం వలన వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉంటోందని, డ్రైనేజీ ఏర్పాటు చేసి వాగుల్లోకి మళ్లించి నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఎక్కువ వర్షపు నీరు నిలిచే పొలాల వద్ద 1–2 సైజు సిమెంటు పైపులు ఏర్పాటు చేసి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోడ్డు నిర్మాణంలో కొన్ని చోట్ల వర్షపునీరు రైతు పొలాల ద్వారా ప్రవహిస్తోందని.. అలా జరగకుండా సమీప వాగులోకి మళ్లించే పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. పీబీసీ కాలువ వద్ద కాలువ నీరు వెళ్లేలా.. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మించాలని హైవే అధికారులకు సూచించారు. ఇందుకు హైవే పీడీ అశోక్‌కుమార్‌రెడ్డి వారంలోపు సర్వీసు రోడ్డు నుంచి రైతుల పొలాలకు మోడల్‌గా తీసుకుని దారి ఏర్పాటు చేస్తామని, ఇందుకు సంబంధించిన ఫొటోలను పంపుతామని, ఎంపీ అంగీకారం తర్వాత పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూస్తామని, ఎక్కువ నీరు నిలిచే ప్రాంతంలో సిమెంటు పైపులు వేస్తామని పేర్కొన్నారు. పీబీసీ కాలువ వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మిస్తామని, వర్షపునీరు రైతుల పొలాల్లోకి వెళ్లకుండా వాగులోకి మళ్లించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

బీటీ రోడ్లకు మరమ్మతులు చేయండి

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణానికి టిప్పర్లతో గ్రావెల్ తరలించే క్రమంలో రోడ్డు పాడైపోయాయని, వాటికి మరమ్మతులు చేయాలని సూచించారు. సిద్ధంరెడ్డిపల్లె – ఎద్దులయేనే, వేల్పుల – సిద్ధంరెడ్డిపల్లె, చింతలజూటూరు – ఎర్రిపల్లె, గోటూరు – పెర్నపాడు గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వీటికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయాలన్నారు. ఇందుకు కంపెనీ ప్రాజెక్టు మేనేజర్ రవీంద్రషా దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులు చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళతా

గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్న సర్వీసు రోడ్డుకు బీటీ రోడ్డు ఏర్పాటు చేసేలా చూడాలని రైతులు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సర్వీసు రోడ్డుకు గ్రావెల్ తోలి వదిలి వేయడం వలన వర్షాకాలంలో ఇబ్బందులు వస్తాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సర్వీసు రోడ్డుకు బీటీ రోడ్డు నిర్మించేలా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళతానని, సర్వీసు రోడ్డుకు బీటీ రోడ్డు నిర్మించేలా చూడాలని కోరతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మరకా శివకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు హేమాద్రిరెడ్డి, రామచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి, చలమారెడ్డి, శ్రీనువాసులరెడ్డి, కంపెనీ ప్రతినిధులు జగదీష్, భాను ప్రకాష్, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న ఏఓ రామాంజులరెడ్డి

కొండాపురం: మండలంలో ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మండల విద్యాశాఖ ఎంఈఓ–2 రామయ్య మాట్లాడుతూ తాళ్లప్రొద్దుటూరు పునరావాస కేంద్రంలో మెయిన్, బీసీ ప్రాథమిక పాఠశాలలకు భవనాలు లేక రేకుల షెడ్‌లలో నిర్వహిస్తున్నమని ఈసమస్యను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లామని, ప్రభుత్వం ద్వారా భవనాలు మంజూరు కావాల్సి ఉందన్నారు. వ్యవసాయ అధికారి రామాంజులరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదుతో పాటు రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు కూడా ఈ పంట నమోదు పక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు. మండలానికి సబ్సిడీ శనగ విత్తనాలు 1,350 క్వింటాళ్లు మంజూరయ్యాయని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించకపోవడంతో సభ నామమాత్రంగా సాగింది. వైస్ ఎంపీపీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు రామమునిరెడ్డి, లక్ష్మి ప్రసన్న, సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ఉరుసు


జెండాను ఊరేగిస్తున్న భక్తులు, నిర్వాహకులు

కమలాపురం: పట్టణంలోని పడమట వీధిలో వెలసిన శ్రీ హజరత్ మహబూబ్ సుబహాని, ఖుత్‌బే రబ్బాని, అబ్దుల్ ఖాదర్ జిలాని, దస్తగిరిస్వామి వారి ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దస్తగిరి స్వామి దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫ్ఫార్ షా ఖాద్రి చేతుల మీదుగా ఉరుసు జెండా ఊరేగింపును ప్రారంభించారు. ఊరేగింపు పట్టణంలోని పురవీధుల గుండా మేళ తాళాలతో దర్గా చేరుకుంది. ఊరేగింపు అనంతరం గంధం ఎక్కించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ముగిసిన క్రీడాపోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ముద్దనూరు: మండల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. మండలంలోని ఉప్పలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన పలువురు విద్యార్థులు డివిజనల్ లెవెల్ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురామ్ అభినందించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఎర్రగుంట్ల : ఆర్టీపీపీలోని ప్రధాన గేటు వద్ద స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగుల, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ వి. సుబ్బిరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. అధికారంలో లేనప్పుడు హామీలిచ్చి.. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని తుంగలో తొక్కడం పాలకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్ట్రగుల్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని స్థానిక శ్రీవీరనారాయణ అంధుల ఆశ్రమంలో శుక్రవారం చేనేత జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీలవర్ధన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి రామలక్ష్మణ్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, రిషి కేశవరెడ్డి, రమణారెడ్డి, పద్మనాభరెడ్డి, రవి, వైఎస్సార్ సీపీ సింహాద్రిపురం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా అంధులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు వారు శ్రీకాంత్‌రెడ్డి జన్మదిన కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపున్నారు.

వాహనాల తనిఖీ

లింగాల : లింగాల మండలం చిన్నకుడాల క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం ఎస్‌ఐ అనిల్‌కుమార్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనాల రికార్డులను, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో లింగాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


డాక్టర్ యు. శ్రీనితకు అవార్డు అందజేస్తున్న వైవీయూ వీసీ తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యు.శ్రీనిత యోగి వేమన విశ్వవిద్యాలయం ఉత్తమ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం వైవీయూ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ బి.రాజశేఖర్, రిజిస్టర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్. వెంకటరామిరెడ్డి, డాక్టర్ యు.శ్రీనితకు అవార్డుతోపాటు ప్రశంసా పత్రం, మెమెంటోలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యు. శ్రీనిత మాట్లాడుతూ వలంటీర్ల సహాయంతో అహోబిలం కాలనీలో స్వచ్ఛ భారత్ పరిసరాల పరిశుభ్రత మొక్కలు నాటడం, నీరు, విద్యుత్ ఆదాపై చుట్టూ పక్కల ప్రజలకు అవగాహన కల్పించడం, ఓటర్ అవేర్నెస్ క్యాంపులు, యాంటీ డ్రగ్ అవగాహన, శక్తి యాప్ ప్రచారం, సైబర్ సెక్యూరిటీపై అవగాహన, మహిళా సాధికారత, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించడం వలన ఈ గుర్తింపు లభించిందన్నారు. శ్రీనితను ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.బాలనారాయణ, అధ్యాపకులు అభినందించారు.

జీవన ఎరువులతో స్థిరమైన ఉత్పత్తులు


మాట్లాడుతున్న డాక్టర్ అంకయ్య

చింతకొమ్మదిన్నె : జీవన ఎరువులతో స్థిరమైన ఉత్పత్తులు పొందవచ్చని కడప డాట్ సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఎస్. కృష్ణప్రియ అన్నారు. నాగిరెడ్డిపల్లి గ్రామంలో జీవన ఎరువుల వినియోగంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవ ఎరువుల ప్రాముఖ్యత, నేల సారాన్ని పెంచడంలో వాటి పాత్ర, పంటలలో స్థిరమైన ఉత్పత్తిని సాధించడంలో వాటి ప్రయోజనాలను రైతులకు డాక్టర్ ఎస్. కృష్ణప్రియ వివరించారు. అలాగే రైజోబియం, అజోస్పిరిల్లం, పీఎస్‌బీ, ట్రైకోడెర్మా వంటి జీవ ఎరువుల వినియోగ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా మేకపాటి గౌతంరెడ్డి వ్యవసాయ కళాశాల, ఉదయగిరి విద్యార్థులు పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ (పీఆర్ఏ) పద్ధతులను గ్రామస్థులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని జీవ ఎరువుల వినియోగంపై పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఇప్పపెంట గ్రామంలో జీవన ఎరువుల వాడకంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్ మాట్లాడుతూ రైతులు అధిక దిగుబడి కోసం విచక్షణ రహితంగా పురుగు మందులు, ఎరువుల వాడకం వలన నేల నిస్సారమై, నీటి, పర్యావరణ కాలుష్యం జరిగి అనేక రోగాలకు గురవుతున్నారన్నారు. ప్రజలలో అవగాహన కల్పించడం కోసం ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వ విదాలయం వారం రోజుల పాటు జీవన వరువుల అవగాహన వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం లో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ బాబు, వ్యవసాయ విద్యార్థులు మరియు ఇప్పపెంట గ్రామ రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుండి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే నూతనంగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించామని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆలయాలను పరిశుభ్రంగా ఉంచాలి


పనులను పర్యవేక్షిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓ

పులివెందుల టౌన్ : ఆలయాలను పరిశుభ్రంగా ఉంచాలని శ్రీచైతన్య డిగ్ర కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి సూచించారు. పురాతనమైన శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో పనులు చేయించడం సంతోషకరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో స్థానిక శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జేసీబీల సహాయంతో పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆలయ ప్రహరీ చుట్టూ పూల మొక్కలు నాటామని తెలిపారు. ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి మాట్లాడుతూ చైతన్య డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ నారాయణరెడ్డి మూడు రోజులుగా ఆలయ ప్రాంగణంలోని పలు పనులను పనులను ఆయన దగ్గరుండి చేయించడం చాలా సంతోషమన్నారు. కార్యక్రమంలో చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ నీరజారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, రామట్లపల్లె సర్పంచ్ ఇరికిరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి, విద్యార్థి విభాగ జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డి, పాలకమండలి సభ్యులు, సీనియర్ పాత్రికేయులు రంగనాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు భావితరాలకు స్ఫూర్తి

పులివెందుల టౌన్ : విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు బావితరాలకు స్ఫూర్తి అని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు, ఆర్‌పీఎఫ్ నాయకులు కొనియాడారు. శ్రీకృష్ణదేవరాయల వర్ధంతిని పురస్కరించుకొని పులివెందులలోని పూలంగల సర్కిల్ సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం నాయకులు, ఆర్‌పీఎఫ్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో గొప్ప పరిపాలనకు నిదర్శనంగా శ్రీకృష్ణదేవరాయలు నిలిచారన్నారు. పులివెందుల బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు ప్రసాద్, కార్యదర్శి ఐటీఐ ఆంజనేయులు, సంఘ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, బత్తెన శేఖర్, సోపాల వీర, సీనియర్ జర్నలిస్టు అల్లం రంగనాయకులు, అంబకపల్లె బాబు, ఆర్పీఎఫ్ నాయకులు శ్రీపతి చక్రవర్తి, శ్రీపతి పెద్ద బాలుడు, పూల సాగర్, ప్రతాప్ పాల్గొన్నారు.

వేంపల్లె : వేంపల్లెలో స్థానిక బీజేపీ కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయులు దేశభాషలందు తెలుగు లెస్స అని తెలుగు భాషను కీర్తించి గొప్ప పేరు తెచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

చింతకొమ్మదిన్నె : పట్టుదలతో కష్టపడి చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో కడప శక్తి టీం సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో చదవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ శాంతమ్మ మాట్లాడుతూ సమస్య ఏదైనా వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. మహిళలకు శక్తి యాప్ రక్షణగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళా సంరక్షణకు ఆర్డినేటర్ ఎం శిరీష, ఎంకే సుభాషిణి, పరిమళ కుమారి, నిర్మల, నిఖిత, స్వరూప, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


విద్యార్థులతో హెడ్మాస్టర్ తదితరులు

తొండూరు : తొండూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రిటైర్డు హెడ్మాస్టర్ వెంకటరామిరెడ్డి, పూర్వ విద్యార్థులు, రమణారెడ్డి, కృష్ణారెడ్డి నగదు, బహుమతులతో సత్కరించారు. అలాగే గణిత ఉపాధ్యాయుడు మచ్చా వెంకటరమణ కూడా బహుమతులు అందించారు. దీన బంధు దివ్యాంగుల సంక్షేమ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల స్ఫూర్తి.. ప్రస్తుత విద్యార్థుల ప్రగతి అని పేర్కొన్నారు.

నేడు స్వచ్ఛమైన గాలిపై అవగాహన

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని స్థానిక నగరిగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఉదయం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో స్వచ్ఛమైన గాలి, పర్యావరణ కాలుష్యం, అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు.

గ్రామ పంచాయతీల్లోనే సంపద సృష్టించుకోవాలి


గాంధీ, అంబేద్కర్ చిత్ర పటాల వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ తదితరులు

కమలాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధుల కోసం ఎదురుచూడకుండా పంచాయతీల్లోని వనరులను సద్వినియోగం చేసుకుని సంపద సృష్టించుకోవాలని ఎంపీడీఓ గౌస్ బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో డిప్యూటీ ఎంపీడీఓ కేజీయా అధ్యక్షతన పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చేవన్నారు. ప్రస్తుతం ఆ నిధులు కేవలం వాటర్ పైప్ లైన్, డ్రైనేజ్ శుభ్రం చేయడం, వీధి దీపాల నిర్వహణ తదితర మౌలిక సదుపాయాలకు వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహాయం తీసుకోవాలని సూచించారు. వారి తోడ్పాటుతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 391 పంచాయతీలను అప్‌గ్రేడ్ చేసిందని, సీనియర్ పంచాయతీ సెక్రటరీలను డిప్యూటీ ఎంపీడీఓలుగా ప్రమోషన్ కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. అనంతరం ఏపీఎం గంగాధర్, ఏపీఓ పార్థ సారధి వారికి సంపద సృష్టిపై శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లింగాల : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సొంత వనరులను సమకూర్చుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి జాతిపిత మహాత్మ గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీలు ఆర్థికంగా పరిపుష్టి పొందడానికి సర్పంచ్‌లకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో లోకేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శనగ విత్తనాలు పంపిణీ చేయాలి

సింహాద్రిపురం : రైతులకు సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీ చేయాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, మాజీ సెడ్‌క్యాప్ డైరెక్టర్ సీబీ కిశోర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వర్షాలు సకాలంలో పడటంతో రైతులు తమ పొలాలు దుక్కి దున్ని ఎరువులు వేసి సేద్యం చేసుకుని రబీకి సిద్ధం చేసుకున్నారని, కానీ ప్రభుత్వం శనగ విత్తనాలు ఇప్పటివరకు పంపిణీ చేయలేదన్నారు. రైతులు ఒకపక్క గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఖరీఫ్‌లో రైతులు తీవ్రంగా నష్టపోయారని, రబీపై కోటి ఆశలతో సాగుకు సన్నద్ధమవుతున్నారని, కానీ ఇప్పటివరకు శనగ విత్తనాలు పంపిణీ చేయలేదని తెలిపారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తోందని ఆయన విమర్శించారు.

సీజేఐపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు


జమ్మలమడుగు రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


కమలాపురం: ర్యాలీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జమ్మలమడుగు రూరల్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి పెనుముప్పు అని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచ్చుకబాబు మాదిగ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం సీజేఐపై దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందని తెలిపారు. జస్టిస్ గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ కోర్టు హాలులో న్యాయవాదులందరూ చూస్తుండగానే దాడికి పూనుకున్న ఘటన అత్యంత హేయమైనచర్యగా అభివర్ణించారు. ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా రాకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, ఓబులేసు, మబ్బు గురప్ప, రామకృష్ణ, పాపోడు, నల్లప్ప పాల్గొన్నారు.

నిరసన

ముద్దనూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని వ్యతిరేకంగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీజేఐపై దాడి చేసిన న్యాయవాదిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమణ, చైతన్య, కల్యాణ్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయం

కొండాపురం: సుప్రీంకోర్టులో సీజేఐ గవాయ్‌పై న్యాయవాది దాడి చేయడం హేయమైన చర్య అని మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు తులసి రాముడు అన్నారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ అనుబంధాల సంఘాల ఆధ్వర్యంలో సీజేఐపై దాడికి వ్యతిరేకంగా కొండాపురంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడిని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలన్నారు. రాజ్యాంగం, న్యాయ వ్యవస్థపైనే దాడిగా పరిగణించి, బాధ్యుడైన న్యాయవాదిని తక్షణం ఆ వృత్తి నుంచి తొలగించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పి. నారాయణస్వామి మాదిగ, జి.పెద్ద మల్లయ్య, రవి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

కమలాపురం: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నరసింహమాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌జైలు పెట్రోల్ బంక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజేఐపై దాడికి పాల్పడిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రామయ్య, సురేష్, ప్రసాద్, రామ పుల్లయ్య, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

పులివెందుల రూరల్ : విద్యార్థులలో నైపుణ్యతను వెలికి తీసేందుకే సర్వజ్ఞ 2కె25 సదస్సు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సర్వజ్ఞ 2కె25 సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో కోడింగ్, చాలెంజెస్ టెక్ మేంతో పాటు జనరేటివ్ ఏఐ, ఫుల్ స్టాకు వర్క్‌షాప్ అవగాహన కల్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ నూతన ఒరవడితో కూడిన విజ్ఞానాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని భవిష్యత్‌లో ఉన్నతమైన ఉద్యోగాలు పొందేలా వారిని తీర్చిదిద్దామన్నారు. సీఎస్ఈ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ జి.మురళి, కో.ఆర్డినేటర్స్ మహేంద్రారెడ్డి, బి.మునిలావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.